అప్రమత్తతతో నకిలీలకు అడ్డు

వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా ఇటీవల అప్పుడప్పుడూ కురుస్తున్న వర్షాలకు నేలలు పదునెక్కి.. సాగుకు సిద్ధమవుతున్నాయి. బీడులుగా ఉన్న పొలాలు దుక్కులు దున్ని.. విత్తనాలు సేకరించుకునేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. నియోజకవర్గంలో ఖరీఫ్ సీజన్లో ప్రధానంగా వరి, వేరుశనగ, కంది, సజ్జలు, పెసర, మినుము పంటలు సాగు చేస్తుంటారు. ముఖ్యంగా ఖరీఫ్ సీజన్‌కు ముందు రైతుల అవసరాన్ని అవకాశంగా భావించి విత్తనాల విక్రయ కేంద్రాలు తక్కువ ధరలు ఆశ చూపి నకిలీలతో రైతులను నట్టేట ముంచే అవకాశం ఎక్కువగా ఉంది. అందుకే రైతులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. దీంతో వారు రైతులకు పలు జాగ్రత్తలను సూచిస్తున్నారు. – నగరి

- అనుమతులు ఉన్నచోటే విత్తనాలు కొనుగోలు చేయాలి
- రశీదులు, విత్తనాల సంచులు భద్రపరచాలి



పురుగుల మందు పిచికారీ చేస్తున్న రైతు



విత్తనాలు విత్తుతున్న రైతు

ఎరువులు.. పురుగు మందుల కొనుగోలులో..

- మిషను కుట్టుతో ఉన్న ఎరువుల సంచులను మాత్రమే వాడాలి. ఒక వేళ చేతికుట్టు ఉన్నట్లయితే సీల్ ఉందో లేదో చూసుకోవాలి.
- లైసెన్స్ దుకాణాల్లో కొనుగోలు చేయాలి. కొనుగోలు చేసిన ఎరువుల బిల్లులను ఖాళీ సంచులను పంటకాలం పూర్తయ్యే వరకు జాగ్రత్తగా ఉంచుకోవాలి.
- ప్రామాణిక పోషకాల వివరాలు, ఉత్పత్తి సంస్థ, ఉత్పత్తిదారుడి పేరు కచ్చితంగా ఉండాలి.
- ఎరువుల నాణ్యతపై అనుమానం ఉంటే తక్షణమే వ్యవసాయశాఖ అధికారుల సహాయంతో పరీక్షలకు పంపాలి.
- చిల్లులు పడినా, చిరిగిన ఎరువుల బస్తాలను కొనుగోలు చేయకూడదు. ఎరువు సంచుల్లో ఎరువుతోపాటు అన్యపదార్థాలు కనిపిస్తే దానిని కల్తీ ఎరువుగా గుర్తించాలి.
- బిల్లుపై కంపెనీ పేరు, ఎరువు పేరు, తయారీ తేదీ, గరిష్ట చిల్లర ధర, తూకం సరిచూసుకోవాలి.
- సూక్ష్మధాతు ఎరువుల్ని ప్రభుత్వం నుంచి తయారీ అనుమతి పొందిన సంస్థల నుంచే కొనుగోలు చేయాలి.
- క్రిమి సంహారక మందుల కొనుగోలు సమయంలో బిల్లులో మందుపేరు, కంపెనీపేరు, గడువు తేదీ, బ్యాచ్ నెంబర్, సీలు సక్రమంగా ఉన్నాయో లేదో చూసుకోవాలి.
- సూచన పత్రంలో ఉన్న అంశాల ప్రకారం మందులు వినియోగించాలి.
- విత్తనాలు, పురుగు మందులు, ఎరువులను బయోమెట్రిక్ విధానంలో కొనుగోలు చేయాలి.
- యూరియా, పొటాషియం తదితర ఎరువులను కొనుగోలు చేసే సమయంలో బస్తా తూకం, ప్రస్తుతం ధర తదితర వాటిని తప్పనిసరిగా చూసుకోవాలి.
- వ్యవసాయ, ఉద్యానవన శాఖాధికారులు సూచించిన పురుగు మందులను వినియోగించుకోవాలి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- వ్యవసాయశాఖ నుంచి లైసెన్స్ పొందిన కంపెనీ డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలి
- విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు ఇచ్చే బిల్లును పంటకాలం పూర్తయ్యేంత వరకు భద్రపరుచుకోవాలి
- విత్తనాలు కొనుగోలు చేసిన వెంటనే మొలకశాతం చూసుకోవాలి
- లూజుగా ఉన్న సంచులు, పగిలిన ప్యాకెట్లు, తెరిచిన డబ్బాల నుంచి విత్తనాలు కొనకూడదు. గడువు దాటిన విత్తనాల జోలికి వెళ్లవద్దు
- కొనుగోలు చేసే విత్తన ప్యాకెట్లు, సంచి, డబ్బాలపై సీలు ఉందో లేదో నిర్ధారించుకోవాలి
- విక్రయదారుడు ఇచ్చే కరపత్రాలు తీసుకొని వాటిలో సూచించిన అంశాలను పరిశీలించాలి
- బిల్లులపై విక్రయదారుడి పేరు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అమ్మకపు పన్ను నెంబర్, రైతు పేరు, గ్రామం పేరు, విక్రయదారుడి సంతకం, తేదీలు, రకం పేరు, బ్యాచ్ నెంబర్, గడువు తేదీలు, నికర తూకం, నికర ధర, కంపెనీ పేరు తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలి

రైతులు అవగాహన కలిగి ఉండాలి



విత్తనాలు, ఎరువుల కొనుగోలు సమయంలో రైతులు అవగాహన కలిగి ఉండాలి. అక్రమార్కుల మోసపూరిత మాటలు నమ్మి నకిలీ విత్తనాలు కొనుగోలు చేయకూడదు. విత్తనాలు, ఎరువుల కొనుగోలు సమయంలో వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలు పాటిస్తే రైతులకు మేలు.

– రాఘవేంద్ర యాదవ్, వ్యవసాయ అధికారి, నగరి మండలం

క్లుప్తంగా

వైఎస్‌ఆర్ సీపీ వెంటే యువశక్తి



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో యువరాజ్

నగరి: యువశక్తి వైఎస్‌ఆర్ సీపీ వెంటే ఉందని పార్టీ నియోజకవర్గ యువత విభాగం అధ్యక్షుడు యువరాజ్ అన్నారు. మంగళవారం పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు మాజీ మంత్రి ఆర్కే రోజా సూచనలతో సమావేశానికి హాజరయ్యారన్నారు. జగనన్న ఇచ్చిన స్ఫూర్తి, దిశా నిర్దేశాలతో నియోజకవర్గంలోని యువశక్తిని ఏకం చేసి పార్టీని బలోపేతం చేస్తామన్నారు. ఏడాది పాలనలో పాలక ప్రభుత్వం యువతను పూర్తి స్థాయిలో మోసం చేసిందన్నారు. ఇచ్చిన హామీలు ఏవీ నెరవేర్చలేదన్నారు. ఈ అంశాలను యువత విభాగం ఆధ్వర్యంలో అందరి సహకారంతో ప్రజల్లోకి తీసుకెళ్తానన్నారు.

పారిశుధ్యం మెరుగు కోసం చర్యలు

వెదురుకుప్పం: గ్రామాల్లో పారిశుధ్యం మెరుగు కోసం చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ పురుషోత్తం అన్నారు. మంగళవారం మండలంలోని సంతబయలు గ్రామంలో నిర్వహిస్తున్న ఇంటింటికీ చెత్త సేకరణ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నివాసాల వద్ద పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించాలన్నారు. అదేవిధంగా ఓవర్‌హెడ్ ట్యాంకులను క్రమం తప్పకుండా శుభ్రం చేయాలని సూచించారు. తాగునీటిని క్లోరినేషన్ చేసి సరఫరా చేయాలన్నారు. ట్యాంకుల వద్ద శుభ్రంగా ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఉమాశంకర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దోమల వృద్ధితో డెంగీ విజృంభణ

వెదురుకుప్పం: దోమల వృద్ధితోనే డెంగీ వ్యాధి విజృంభిస్తోందని వైద్యాధికారి క్రిష్ణచైతన్య అన్నారు. మంగళవారం మండలంలోని పచ్చికాపల్లం పీహెచ్‌సీలో డెంగీ నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రధానంగా దోమల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. డెంగీ వ్యాధి దోమలు కుట్టడం ద్వారానే వస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా దోమ తెరలు వాడి డెంగీని నివారించాలని సూచించా రు. కార్యక్రమంలో వైద్యాధికారి చెంగారెడ్డి, సీహెచ్ఓ క్రిష్ణారెడ్డి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పరిశుభ్రతతో రోగాలు దూరం

గంగాధరనెల్లూరు: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే దోమలు వృద్ధి చెందకుండా నిర్మూలించగలమని, రోగాలకు దూరంగా ఉండవచ్చని జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్ అన్నారు. డెంగీ నివారణ మాసోత్సవాల సందర్భంగా గంగాధరనెల్లూరు మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు, పాఠశాల విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. డెంగీ, మలేరియా జ్వరాలను నిర్మూలించాలంటే పరిసరాల పరిశుభ్రత ప్రథమ మార్గమని, తీవ్రమైన జ్వరం, ఏవైనా లక్షణాలు ఉంటే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్, పీహెచ్‌సీ సిబ్బంది, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

తొమ్మిదో రోజు కార్మికుల సమ్మె



సమ్మె చేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు

నగరి: రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల జేఏసీ ఆధ్వర్యంలో తమ సమస్యలు పరిష్కారం కోసం అవుట్ సోర్సింగ్ కార్మికులు చేస్తున్న సమ్మె 9వ రోజుకు చేరుకుంది. 9 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడంపై అవుట్ సోర్సింగ్ కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇంజినీరింగ్ విభాగంలో వీధి దీపాలు, నీటి సరఫరా, టౌన్ ప్లానింగ్‌లో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేస్తామని, వేతనాలు పెంచుతామని, హెచ్‌ఆర్ పాలసీ అమలు చేస్తామని కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

వృద్ధులకు అన్నదానం



వృద్ధులకు అన్నదానం

కార్వేటినగరం: రాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమంలో వైఎస్‌ఆర్ సీపీ ముస్లిం యువ నాయకుడు తౌకీర్‌ఖాన్ ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు. వృద్ధాశ్రమంలో భారీ కేక్ కట్‌చేసి పండ్లు, స్వీట్లు పంచిపెట్టారు. వైఎస్‌ఆర్ సీపీ మండల కన్వీనర్ శేఖర్‌రాజు, వైస్ ఎంపీపీ కార్తీక్‌రెడ్డి, పట్నం ప్రభాకర్‌రెడ్డి, చందురాజు, మణిరెడ్డి, దామురెడ్డి, రఫీ, అమితుల్లా, యశ్వంత్‌ఖాన్, సర్దార్, సిరాజ్, ధనశేఖర్‌యాదవ్, శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

నేడు గ్రామసభ

పుత్తూరు: తడుకు పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం ఉదయం 10 గంటలకు గ్రామసభ నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి అనిల్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. కనకదుర్గ మైనింగ్ ప్రైవేట్ లిమిటెడ్ వారి క్వారీలపై ప్రజాభిప్రాయ సేకరణ చేపడుతున్నట్లు తెలిపారు.

లోక్ అదాలత్‌లో న్యాయవాదులే కీలకం



సూచనలిస్తున్న న్యాయమూర్తులు



సమావేశానికి హాజరైన న్యాయవాదులు

పుత్తూరు: పట్టణంలోని సబ్ కోర్టు ఆవరణలో ఈనెల 5న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్ విజయవంతం చేయడంలో న్యాయవాదులు కీలక పాత్ర పోషించాలని స్థానిక సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు ఎస్.సి.రాఘవేంద్ర కోరారు. మంగళవారం స్థానిక సబ్ కోర్టులో న్యాయవాదులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ అత్యధిక కేసుల పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు. న్యాయవాదులు, పోలీసులు ప్రధానంగా ప్రామిసరీ నోటు, చెక్కు బౌన్స్ కేసులు రాజీ చేయాలని సూచించారు. పెండింగ్‌లోని సివిల్, రాజీకి లోబడిన క్రిమినల్ కేసులు, మనోవర్తి, ప్రీలిటిగేషన్ కేసుల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. నగదుతోపాటు విలువైన కాలన్ని సద్వినియోగం చేసుకోవడంతోపాటు మానసిక ఆందోళనలకు దూరం కావాలంటే రాజీ మార్గమే సురక్షితమైనదని కక్షిదారులకు అవగాహన కల్పించాలని వివరించారు. లోక్‌అదాలత్ తీర్పు అంతిమ తీర్పని, దీనిపై అప్పీల్‌కు వెళ్లే అవకాశం లేదని స్పష్టం చేశారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సి.జానకి, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి రమ్యసాయి న్యాయవాదులకు తగిన సూచనలు చేశారు. సమావేశంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సురేష్‌బాబు, సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి



మాట్లాడుతున్న ఏడీఏ లక్ష్మీదేవి

పుత్తూరు: రైతులు మెరుగైన వ్యవసాయ యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చునని పుత్తూరు డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు కె.లక్ష్మీదేవి తెలిపారు. మంగళవారం పట్టణ పరిధిలోని అమరంకండ్రిగలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ అధిక రసాయనిక ఎరువుల వినియోగం నివారించాలని, విత్తన ధ్రువీకరణకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అలాగే పంట నమోదు ప్రాముఖ్యత, పచ్చిరొట్ట విత్తనాల వినియోగం, క్రాప్ ఇన్సూరెన్స్, సేంద్రీయ వ్యవసాయం, నవధాన్యాల కిట్‌పై వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి కోదండయ్య, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పేదల డాక్టర్ శ్రీనివాసులురెడ్డి



కేక్ కట్ చేస్తున్న డాక్టర్ శ్రీనివాసులురెడ్డి

పుత్తూరు: పట్టణ, పరిసర గ్రామాల పేద ప్రజలకు ఆరాధ్యవైద్యులుగా డాక్టర్ కె.శ్రీనివాసులురెడ్డి వెలుగొందుతున్నారని వైఎస్‌ఆర్ సీపీ నాయకుడు, మున్సిపల్ కౌన్సిలర్ కె.నరసింహారావు అన్నారు. మంగళవారం పట్టణంలో డాక్టర్ శ్రీనివాసులురెడ్డి 84వ పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ ఎనిమిది పదుల వయస్సులోనూ అనునిత్యం వైద్య సేవలందించడం పుత్తూరు ప్రజలకు వరం లాంటిదన్నారు. పుత్తూరు వాకర్స్ అసోసియేషన్‌ను ఏర్పాటు చేసి గత పాతికేళ్లుగా తాను నడుస్తూ పట్టణ ప్రజలను నడిపిస్తూ ఆరోగ్యాన్ని అందిస్తున్నారన్నారు. అసోసియేషన్‌కు సొంత భవన ఏర్పాటులోనూ డాక్టర్ చేసిన కృషి వెలకట్టలేనిదన్నారు. అనంతరం డాక్టర్ శ్రీధర్‌రాజు, డాక్టర్ సుభాషిణి, తహసీల్దార్ సుబ్రమణ్యం, వాకర్స్ అసోసియేషన్ నాయకులు గుణశేఖర్‌రెడ్డి, మూర్తి, యుగంధర్‌రాజు, స్వర్ణరమేష్, కుప్పయ్యశెట్టి, మాధవులునాయుడు, గోపికృష్ణ డాక్టర్‌ను ఘనంగా సత్కరించారు.

హత్య కేసులో నిందితుల అరెస్టు

విజయపురం: మండల పోలీస్ స్టేషన్ పరిధిలో గత నెల 23వ తేదీ భూ తగాదా కారణంగా తమిళనాడు రాష్ట్రానికి చెందిన వెంకటేశ్వరన్ (55) హత్య చేసిన కేసులో నిందితులను పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. ఈ మేరకు నగరి రూరల్ సీఐ భాస్కర్ కేసుకు సంబంధించిన వివరాలను మీడియాకు వెల్లడించారు. తమిళనాడు తిరుత్తణి తాలూకా అరుంబాకానికి చెందిన వెంకటేశ్వరన్ అదే కాలనీకి చెందిన వెంకటేశన్‌కు గత 12 సంవత్సరాలుగా భూ తగాదా ఉంది. ఈ సందర్భంగా గత నెల 23వ తేదీ వెంకటేశన్, తన ఇద్దరు కుమారులు ప్రభు, సేతుపతితో కలసి పాతర్కాడు సమీ పంలో కొబ్బరి తోట వద్ద కాపుకాశారు. అక్కడకు వచ్చిన వెంకటేశ్వరన్‌ను కత్తితో దాడి చేసి హత్య చేశారు. అనంతరం అక్కడి నుంచి పరారయ్యారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు గత నెల 26వ తేదీ వెంకటేశన్‌ను అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. పరారీలో ఉన్న ప్రభు, సేతుపతిలను మాత్రం మంగళవారం అరెస్టు చేశారు. హత్య చేసే సమయంలో ఉపయోగించిన ట్రాక్టర్, రెండు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులను మంగళవారం రిమాండ్‌కు పంపినట్లు ఆయన తెలిపారు. ఈ కేసును పరిష్కరిచడంలో చొరవ చూపి సహకరించిన ఎస్ఐ రంగా, పోలీసు సిబ్బంది గోవిందరాజులు, దామోదరం, నరేష్, ఎలుమలై, మణమల్లన్, గోపి, అయ్యప్పలను ప్రశంసించారు.

భక్తిశ్రద్ధలతో ద్రౌపదీ కల్యాణం



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న వేద పండితులు

కార్వేటినగరం: మండల కేంద్రం కార్వేటినగరంలో గత ఐదు రోజులుగా జరుగుతున్న మహాభారత వార్షికోత్సవాల్లో భాగంగా మంగళవారం శ్రీద్రౌపదీ, ధర్మరాజుల స్వామివారి కల్యాణాన్ని వేదపండితులు వేద మంత్రాల నడుమ అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ద్రౌపదీ అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేక వాయిద్యాల నడుమ గ్రామ వీధుల్లో ఊరేగించారు. దీంతో మొక్కులున్న భక్తులు అమ్మవారికి వడిబాల సమర్పించుకున్నారు. అలాగే ఇంటింటా కర్పూర హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కల్యాణ మండపానికి అమ్మవారిని తీసుకొచ్చి ధర్మరాజులు, భీమ, అర్జున, నకుల, సహదేవుల ఉత్సవమూర్తుల తోపాటు శ్రీకృష్ణుని సమక్షంలో స్వామివారి కల్యాణోత్సవాన్ని వేద పండితులు వేద మంత్రాల నడుమ ముత్యాల తలంబ్రాలు పోసి, కనుల విందుగా నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేక వాహనంపై ప్రతిష్ఠించి పురవీధుల్లో అంగరంగ వైభవంగా ఊరేగించారు. కల్యాణోత్సవానికి రెడ్డి కులస్తులు ఉభయదారులు వ్యవహరించారు. దంపతులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం విజయమ్మ(పాండిచ్చేరి) కుటుంబ సభ్యులు, అన్నదానం నిర్వహించారు. అలాగే రాత్రి అమ్మవారి కల్యాణోత్సవాన్ని పురస్కరించుకుని రెడ్డి కులస్తులు అన్నదానం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు రవియాదవ్, ప్రధాన కార్యదర్శి గౌతంరాజు, ఉపాధ్యక్షుడు కట్ల రవిరెడ్డి, కోశాధికారి లక్ష్మీపతి, ఉప కోశాధిపతి సాయిరాయల్, భక్తులు పాల్గొన్నారు.



కల్యాణోత్సవానికి తరలివచ్చిన భక్తులు

దయాసాగర్‌రెడ్డికి పరామర్శ



దయాసాగర్‌రెడ్డిని పరామర్శిస్తున్న మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, సమన్వయకర్త కృపాలక్ష్మి

పెనుమూరు(కార్వేటినగరం): వైఎస్‌ఆర్ సీపీ నాయకుడు, సత్యవేడు నియోజకవర్గం ఎన్నికల పరిశీలకుడు మహాసముద్రం దయాసాగర్‌రెడ్డి మోకాలికి శస్త్రచికిత్స చేసుకున్నట్లు సమాచారం అందుకున్న రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి, నియోజకవర్గం సమన్వయ కర్త కృపాలక్ష్మి నాయకులతో కలసి మంగళవారం గ్రామానికి వెళ్లి దయాసాగర్‌రెడ్డిని పరామర్శించి ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. గుడ్యాణంపల్లి గ్రామానికి చెందిన వైఎస్‌ఆర్ సీపీ నాయకుడు జగన్నాథరెడ్డి కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధ పడుతున్నట్లు తెలుసుకుని, వారి గ్రామానికి వెళ్లి, పరామర్శించి ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మండల పార్టీ కన్వీనర్ విజయకుమార్‌రెడ్డి, మాజీ మండల కన్వీనర్ మహాసముద్రం సురేష్‌రెడ్డి, జిల్లా నాయకులు దూది మోహన్, గిరిధర్‌రెడ్డి, నవీన్‌కుమార్‌రెడ్డి, ఉమాపతి, జ్యోతినాథ్, మండల కార్యకర్తలు ఉన్నారు.

ఉపకరణాలను వినియోగించుకోవాలి



ఎంపీడీఓ మోహన్‌మురళి

శ్రీరంగరాజపురం: ఉపకరణాలకు ఎంపికైన లబ్ధిదారులు కేంద్ర ప్రభుత్వం అందించే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ మోహన్ మురళీ తెలిపారు. మంగళవారం ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంపీడీఓ మాట్లాడుతూ గత సంవత్సరం డిసెంబరు 18వ తేదీ ఎస్సార్‌పురం ఉన్నత పాఠశాలలో దివ్యాంగులు, అలాగే వికలాంగులకు, వృద్ధులకు నిర్వహించిన సదరం క్యాంపు కార్యక్రమంలో 195 మంది వివిధ రకాలైన లోపాలతో అర్హత సాధించారని తెలిపారు. వారికి ఈ నెల 3వ తేదీ చిత్తూరు పీవీకేఎస్ కళాశాలలో కేంద్ర మంత్రి ద్వారా అందించిన వీల్‌చైర్లు, ట్రైసైకిళ్లు, బ్యాటరీ సైకిళ్లు, చేతి కర్రలు, వినికిడి యంత్రాలు తదితర ఉపకరణాలను అదిస్తామన్నారు. ఎంపికైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, లబ్ధిదారులకు 3వ తేదీ ఎంపీడీఓ కార్యాలయం నుంచి ఉదయం 7 గంటలకు ఉచిత బస్సు సౌకర్యం ఏర్పాటు చేశామన్నారు. లబ్ధిదారులు స్వయంగా వారి ఆధార్ కార్డుతోపాటు, డాక్టర్ జారీ చేసిన ధ్రువపత్రంతో హాజరు కావాలని సూచించారు.

పాఠశాల స్థాయి తగ్గింపుపై నివేదిక

వెదురుకుప్పం: మండలంలోని యనమలమంద గ్రామంలో గతంలో ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలను తాజాగా ప్రభుత్వం ప్రాథమిక పాఠశాలగా తగ్గించడంపై స్థానికులు, విద్యార్థులు చేస్తున్న నిరసన కార్యక్రమంపై తహశీల్దార్ బాబు స్పందించారు. గ్రామంలోకి వెళ్లిన తహశీల్దార్ బాబు ఆందోళనకారులతో మాట్లాడి వారి డిమాండ్‌లను అడిగి తెలుసుకున్నారు. తహశీల్దార్ మాట్లాడుతూ విద్యార్థులు, తల్లిదండ్రుల సమస్యను జిల్లా కలెక్టర్‌కు నివేదిస్తున్నట్లు చెప్పారు.

టీడీపీలో కుమ్ములాటలు

పాలసముద్రం: మండల కేంద్రంలోని సింగిల్‌విండో కార్యాలయ ఆవరణలో మంగళవారం టీడీపీ అధ్యక్షుడు లేకుండానే ఎమ్మెల్యే వర్గానికి చెందిన టీడీపీ నాయకులు సమావేశం నిర్వహించారు. అందుకు చిట్టిబాబు, మండల అధ్యక్షుడి వర్గానికి చెందిన టీడీపీ నాయకులు సమావేశం ఎలా నిర్వహిస్తారని గొడవలకు దిగారు. ఎమ్మెల్యే వర్గానికి చెందిన వనదుర్గాపురం గ్రామానికి చెందిన ఒక టీడీపీ నాయకుడిని చితకబాదారు. ఎమ్మెల్యే వర్గానికి చెందిన టీడీపీ నాయకులు వేరే చోట సమావేశం నిర్వహించారు. మండల కేంద్రంలో పాలసముద్రం చిట్టిబాబు నాయుడుకి చెందిన ఒక టీడీపీ నాయకుడు, ఎమ్మెల్యే వర్గానికి చెందిన ఆముదాల టీడీపీ నాయకుడు రెవెన్యూ కార్యాలయ ఆవరణలో ఒకరినొకరు తోసుకుని గొడవలు పడ్డారు. ఇలా రోజు రోజుకి ఇరువర్గాలు ఘర్షణలు, గొడవలు పెరిగిపోతున్నాయి.

గాయపడిన వ్యక్తి మృతి



సుబ్రమణ్యం

కార్వేటినగరం: మండలంలోని కత్తెరపల్లి గ్రామానికి చెందిన విశ్రాంత ఉద్యోగి సుబ్రమణ్యం (68) ద్విచక్ర వాహనంపై వెళుతూ ఆదివారం రోడ్డుపై కుక్క అడ్డం రావడంతో పడిపోవడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో అతన్ని వారి కుటుంబ సభ్యులు తిరుపతి పద్మావతి ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడు కృష్ణాపురం జలాశయంలో లష్కర్‌గా పని చేసి, పదవీ విరమణ పొందాడు. అతనికి భార్య, కుమారుడు ఉన్నారు. ఆయన మృతిపై సుబ్రమణ్యం కుమారుడు షణ్ముగం యాదవ్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అగ్నిప్రమాదంపై ఫిర్యాదు



కాలిపోయిన ముడి సరుకులు

వెదురుకుప్పం: మండలంలోని అగ్గిచేనుపల్లె సమీపంలో ఉన్న కమ్మీల ఫ్యాక్టరీలో అగ్నిప్రమాదం చోటుచేసుకోవడంతో బాధితుడు సుధాకర్‌రెడ్డి మంగళవారం వెదురుకుప్పం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫ్యాక్టరీలో మంటలు చెలరేగి ముడి సరుకు కాలిపోవడంతో తీవ్ర నష్టం వాటిల్లిందని ఫిర్యాదులో పేర్కొన్నాడు. దేవుడికి పూజ చేసే క్రమంలో దీపం వెలుతురు ద్వారా మంటలు వ్యాపించి ప్రమాదం సంభవించినట్లు ఎస్ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు. ఎంత నష్టం వాటిల్లిందనే అంచనా వేయలేదన్నారు. ప్రమాదంపై దర్యాప్తు చేయాల్సి ఉందన్నారు.

స్పర్శను గుర్తించాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ విక్రమ్

నగరి: ఎదుటి వ్యక్తి తాకితే ఆ స్పర్శ మంచిదా లేక చెడుగా ఉందా అని బాలికలు తెలుసుకోవాలని సీఐ విక్రమ్ అన్నారు. మంగళవారం స్థానిక ఎస్‌జీఎస్ బాలికల జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ‘గుడ్ టచ్.. బ్యాడ్ టచ్’ అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో అమ్మాయిలకు ఎటువైపు నుంచి ఎప్పుడు ఏ ఆపద వస్తుందో ఎవరికీ తెలియని పరిస్థితి ఉందన్నారు. కొన్ని ఘటనలు పరిశీలిస్తే సుపరిచితులతోనే బాలికలకు ముప్పు పొంచి ఉన్నట్లు స్పష్టం అవుతోందన్నారు. ప్రేమని మాయమాటలు చెప్పి నమ్మించి ఏకాంత ప్రదేశాలకు తీసుకెళ్లి అఘాయిత్యాలకు పాల్పడుతన్నారన్నారు. తల్లిదండ్రులు మేల్కోవాలని పిల్లలకు ‘గుడ్ టచ్.. బ్యాడ్ టచ్’ ఏదో తెలియజేయాలన్నారు. పిల్లల భవిష్యత్తు విషయంలో ఎంత ప్రాధాన్యం ఇస్తున్నారో గుడ్ టచ్, బ్యాడ్ టచ్ అంశంలోనూ అవగాహన కల్పించడానికి అంతకన్నా ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. పిల్లలకు ఎవరి వద్దయినా అసౌకర్యంగా అనిపిస్తే వెంటనే వారి గురించి ఇంట్లో చెప్పాలని. వారికేదైనా చేదు అనుభవం ఎదురై ఉంటే సున్నితంగా, మెల్లగా అడిగి సమస్య తెలుసుకొని పరిష్కరించాలన్నారు. గ్రామీణ పిల్లల్లో చైతన్యం తీసుకురావాల్సిన బాధ్యత ఉపాధ్యాయినులపైనే ఎక్కువగా ఉంది. బ్యాడ్ టచ్‌పై తక్షణం వ్యతిరేకించడమెలాగో నేర్పించాలన్నారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.